క్లుప్తంగా

మద్యం దుకాణానికి దరఖాస్తులు నిల్

- నేటితో ముగియనున్న గడువు

కోవెలకుంట్ల: గీత కార్మికులకు మద్యం దుకాణాలు కేటాయించేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయగా కోవెలకుంట్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఒక దుకాణం కేటాయించారు. ఉయ్యాలవాడ మండలానికి ఒక దుకాణం మంజూరైంది. ఈ నెల 5వ తేదీ నాటికి దరఖాస్తుల స్వీకరణకు గడువు విధించగా ఒక్క దరఖాస్తు కూడా రాకపోవడంతో గడువును ఈ నెల 8వ తేదీ వరకు పెంచారు. దరఖాస్తుదారులు రూ. 2 లక్షల దరఖాస్తు రుసుం చెల్లించాల్సి ఉంది. గడువు పెంచినప్పటికీ దరఖాస్తులు చేసుకునేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఇప్పటి వరకు ఒక్క దరఖాస్తు అందకపోవడం గమనార్హం. శనివారం సాయంత్రం 5 గంటలకు దరఖాస్తుల స్వీకరణకు గడువు ముగియనుండగా ఒక్క రోజులో ఏ మేరకు దరఖాస్తులు అందుతాయో వేచి చూడాల్సిందే.

నేడు డయల్ యువర్ డీఎం

కోవెలకుంట్ల: ప్రజా రవాణా సమస్యలపై స్థానిక ఆర్టీసీ డిపోలో శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ తిరుపతయ్య తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. డిపో పరిధిలోని ఆయా రూట్లలో తిరిగే బస్సు సర్వీసులపై సూచనలు, సలహాలు, ఫిర్యాదులు అందజేయాలన్నారు. ఉదయం 11 గంటలనుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. 9959225798 నంబర్‌కు కాల్ చేసి సమస్యలు తెలియజేయాలని సూచించారు.

నివాళి



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె రూరల్: మండలంలోని పాతపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కుమ్మరి మహేష్ కుమారుడు కుమ్మరి రాము (35) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మృతుడి ఇంటికి వెళ్లి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు మనోహర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

వాహన రికార్డులు తప్పనిసరి



వాహనాల తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ

డోన్: వాహనాలకు సంబంధించి ఇన్సూరెన్సు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌తో పాటు డ్రైవింగ్ లైసెన్సు, ఆర్సీ తప్పనిసరిగా కలిగి ఉండాలని జలదుర్గం ఎస్‌ఐ నాగార్జున అన్నారు. ప్యాపిలి మండల పరిధిలోని చిగురుమాను సర్కిల్ వద్ద శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులు సక్రమంగా లేని 20 వాహనాలపై రూ.3,450 జరిమానా విధించారు. అన్ని రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలని సూచించారు. వాహన చోదకులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని తెలిపారు. కారు డ్రైవింగ్ సమయంలో సీటు బెల్టు, ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు.

మాలల యుద్ధ గర్జనను విజయవంతం చేద్దాం



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

కొలిమిగుండ్ల: కర్నూలులో ఈనెల 23న తలపెట్టిన రాయలసీమ మాలల యుద్ధ గర్జన సభను విజయవంతం చేద్దామని మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరి కోరారు. శుక్రవారం కొలిమిగుండ్లలో ఆ సంఘం నాయకులతో కలిసి కరపత్రాలను విడుదల చేశారు. ఆర్టికల్ 341 ప్రకారం పార్లమెంట్‌లో బిల్లు పాస్ కాకుండానే ఎస్సీ వర్గీకరణ ఎలా చేస్తారని ప్రశ్నించారు. నాయకులు మద్దిలేటి, నాగరాజు, సుబ్బరాయుడు, నడిపెన్న, అనిల్, రాజశేఖర్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రయదారులకు 14 శాతం మార్జిన్

- సీఐ వరలక్ష్మి

డోన్ టౌన్: మద్యం షాపు లైసెన్స్‌దారులకు రాష్ట్ర ప్రభుత్వం 14 శాతం మార్జిన్ చెల్లించడానికి నిర్ణయం తీసుకున్నట్లు డోన్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. డోన్ ఎక్సైజ్ పరిధిలో గౌడ కులస్తులకు రెండు మద్యం దుకాణాలకు అనుమతి ఉందని.. దరఖాస్తు చేసుకునేందుకు శనివారం చివరి రోజు అని తెలిపారు. ఇందులో మున్సిపాలిటీ పరిధిలో ఒకటి, గ్రామీణ ప్రాంతం పరిధిలో ఒకటి మంజూరైనట్లు చెప్పారు. వివరాలకు డోన్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

జల గండం

- తగ్గుముఖం పడుతున్న భూగర్భ జలాలు
- గ్రామాల్లో జటిలం కానున్న నీటి సమస్య
- వేసవికి ముందే ఆందోళన



మోడల్ స్కూల్ సమీపంలోని సీపీడబ్ల్యూ స్కీం



సద్దలవెంగన్న చెరువులో అడుగంటిన నీరు

కొలిమిగుండ్ల: వేసవి ఆరంభానికి ముందే భూగర్భ జలాలు తగ్గుముఖం పడుతున్నాయి. గత ఏడాది కొలిమిగుండ్ల మండలంలో ఆశించిన వర్షాలు కురవలేదు. వాగులు, వంకలు పొంగి పొర్లిన దాఖలాలు లేవు. చెరువుల్లో అంతంత మాత్రంగా ఉన్న నీళ్లు సైతం ఆవిరైపోతున్నాయి. ఇప్పటికే గ్రామాల్లో తాగునీరు అందించే బోర్లలో భూగర్భ జలాలు తగ్గిపోయాయి. అంకిరెడ్డిపల్లె, కొలిమిగుండ్ల, గొర్విమానుపల్లె, పెట్నికోట, కొండమీదపల్లె తదితర గ్రామాల్లో ఇప్పటికే బోర్లలో గంగమ్మ పాతాళానికి పడిపోయింది. ఈనెలాఖరు నాటికి చాలా గ్రామాల్లో తాగునీటి సమస్య జటిలమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య ఏర్పడడంతో అధికారులు కొత్తగా బోర్లు వేయడం, మోటర్లు ఏర్పాటు చేయడం చేస్తున్నారు. వర్షపాతం తక్కువగా నమోదు కావడంతో రానున్న రోజుల్లో నీటి సమస్య ప్రజలను తీవ్రంగా వేధించే అవకాశాలు ఉన్నాయి. వేసవి వచ్చిందంటే మండల ప్రజలకు నీటి సమస్య తప్పడం లేదు.

అవుకు జలాలే కీలకం

వేసవిలో పల్లెల్లో తాగునీటి సమస్యను కొంత వరకైనా తీర్చేందుకు అవుకు రిజర్వాయర్‌కు చెందిన సీపీడబ్ల్యూ స్కీం కీలకం కానుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మూడో ఫేజ్ కింద రూ.8.5 కోట్లతో కొలిమిగుండ్ల మండలంలో బెలుం శింగవరం, ఇటిక్యాల, కనకాద్రిపల్లె, రాఘురాజుపల్లె, అంకిరెడ్డిపల్లె, తుమ్మలపెంట, చింతలాయిపల్లె, తిమ్మనాయినపేటతో పాటు మొత్తం తొమ్మిది గ్రామాలకు నీరందించేందుకు చర్యలు తీసుకుంది. కొలిమిగుండ్లలోని మోడల్ స్కూల్ సమీపంలో 2.5 లక్షల సామర్థ్యంతో గ్రౌండ్ లెవల్ సంప్, ఇటిక్యాల, అంకిరెడ్డిపల్లె సమీపంలో 40 వేల లీటర్ల ఓవర్ హెడ్ ట్యాంక్‌లు నిర్మించారు. ఈ తొమ్మిది గ్రామాలకు నీటి సరఫరా అందించేందుకు 30 కి.మీ మేర పైపులైన్ ఏర్పాటు చేశారు. మొదటి, రెండో ఫేజ్‌లలో కూడా మండలంలోని పలు గ్రామాలకు అవుకు జలాలు అందిస్తున్నారు. గ్రామాల్లో నీటి సమస్య ఏర్పడకుండా ఉండేందుకు గత ప్రభుత్వంలో లక్షలు వెచ్చించి పైపులైన్‌లకు లీకేజీలు లేకుండా చర్యలు తీసుకుంది. ప్రస్తుత వేసవిలో ఈస్కీం పైనే ప్రజలు ఆధారపడ్డారు. లీకేజీలు లేకుండా స్కీంను నిర్వహణ చేస్తే గ్రామాల్లో తాగునీటికి కటకట ఉండదని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు చేపడుతున్నాం

వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో బోర్లలో భూగర్భ జలాలు తగ్గిపోవడంతో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాం. శివరాత్రి తర్వాత గ్రామాల్లో మరింత నీటి సమస్య అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రజలకు ఇబ్బంది లేకుండా రైతులు, ప్రజలకు చెందిన బోర్లను ఉపయోగించుకుని తాగునీటి సరఫరా కల్పించేందుకు ప్రణాళిక చేస్తున్నాం.

–కరీముల్లా, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

ఘనంగా చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ



అమ్మవారికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న సిబ్బంది

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారి పల్లకీ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం, ప్రత్యేక అలంకరణ, నైవేద్య సమర్పణ, మహా మంగళ హారతులు తదితర పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని సుందరంగా ముస్తాబు చేసిన పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ పాల్గొన్నారు.

పార్టీలో కష్టపడేవారికి తగిన గుర్తింపు



మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్న నాయకులు

బనగానపల్లె రూరల్: వైఎస్సార్‌సీపీలో కష్టపడి పనిచేసేవారికి తగిన గుర్తింపు ఉంటుందని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. ఆ పార్టీ బనగానపల్లె నియోజకవర్గ వలంటీర్ల విభాగం అధ్యక్షుడిగా నియమితులైన కమటం రవికుమార్‌గౌడ్, అంగన్‌వాడీ అనుబంధ సంఘాల నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమితులైన కుమ్మరి సురేష్ శుక్రవారం కాటసానిని ఆయన నివాసంలో వేర్వేరుగా కలిశారు. తమపై ఎంతో నమ్మకంతో పదవుల్లో నియమించడంపై కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. పార్టీని నమ్ముకుని కష్టపడి పనిచేసే వారికి తప్పక న్యాయం జరుగుతుందని తెలిపారు. టీడీపీ అరాచకాలను ప్రజలకు వివరించాలన్నారు. వారి వెంట పార్టీ నియోజకవర్గ ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు పి.వెంకటసుబ్బయ్య, నాయకులు జగదీశ్వర రెడ్డి, శంకర్‌రెడ్డి, ప్రతాప్ యాదవ్, దేవుడు, అమీర్, మహేశ్వరరెడ్డి, కలాం తదితరులు ఉన్నారు.

వివాహ వేడుకలో మాజీ ఎమ్మెల్యే కాటసాని

బనగానపల్లె: పట్టణంలోని ధనలక్ష్మీ ఫంక్షన్‌హాలో శుక్రవారం జరిగిన ఏపీడబ్ల్యూజేఎఫ్ యూనియన్ బనగానపల్లె మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, రమాదేవి దంపతుల కుమార్తె శ్రీవిద్య, లోకేష్‌రెడ్డి వివాహ వేడుకకు మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించారు. వైఎస్సార్‌సీపీ అవుకు, బనగానపల్లె మండల కన్వీనర్లు కాటసాని తిరుపాల్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, యాగంటి ఆలయ మాజీ చైర్మన్ తొట బుచ్చిరెడ్డి, సజ్జాద్, ఈశ్వర్‌నాయక్ ఉన్నారు.

పోస్టులు ఖాళీ.. రెవెన్యూ సేవల్లో జాప్యం



తహసీల్దార్ కార్యాలయం

కొలిమిగుండ్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నెలల తరబడి నుంచి కీలకమైన పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రజలకు సకాలంలో రెవెన్యూ సేవలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్‌ఐ, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్‌లు, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ పోస్టులతో పాటు అబ్దులాపురం, పెట్నికోట గ్రామాలకు వీఆర్వోల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇటిక్యాల వీఆర్వో కొద్ది రోజుల క్రితం సస్పెన్షన్‌కు గురి కావడంతో ఆయన స్థానంలో మరొకరికి ఇన్‌చార్జ్ అప్పగించారు. నైట్‌వాచ్‌మన్ లేక పోవడంతో వీఆర్‌ఏలను రోజుకు ఒకరిని చొప్పున డ్యూటీలు వేస్తున్నారు. రైతులు, విద్యార్థులు, ప్రజలు వివిధ రకాల రెవెన్యూ సేవల కోసం కార్యాలయానికి వస్తుంటారు. ఆర్‌ఐ, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉండడంతో వివిధ రకాల సర్టిఫికెట్లు సకాలంలో అందడం లేదు. ఆరేడు నెలల నుంచి అధికారులు లేకపోవడంతో మిగిలిన అధికారులపై భారం పడుతోంది. ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

స్టెమీ చికిత్సతో గుండెకు భరోసా

- అందుబాటులో రూ.45వేల విలువ చేసే ఇంజెక్షన్
- అవుకు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ అభినయ్



గుండె వ్యాధిగ్రస్తులకు అవగాహన కల్పిస్తున్న అభినయ్

అవుకు: గుండె జబ్బుల మరణాలను నివారించేందుకు స్టెమీ చికిత్స ఎంతో ఉపయోగపడుతుందని అవుకు సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ అభినయ్ అన్నారు. అవుకు సీహెచ్‌సీలో గుండె వ్యాధిగ్రస్తులకు స్టెమీ చికిత్సపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. గుండెపోటుకు గురైన వ్యక్తులు దగ్గరలోని సీహెచ్‌సీకి వెళితే గుండెలోని నాళాల్లో బ్లడ్‌క్లాట్ అయి ఉంటే ఆ పేషెంట్‌కి టెనెక్టెప్లస్ ఇంజెక్షన్ ఇస్తామని తెలిపారు. ఇది నాళాల్లోని క్లాట్‌ను కరిగించి ప్రాణాపాయం నుంచి రక్షిస్తుందన్నారు. ఈ ఇంజెక్షన్ రూ.45వేలు ఉంటుందని.. సీహెచ్‌సీ, ఏరియా, జిల్లా ఆస్పత్రుల్లో ఉచితంగానే ఇస్తారని తెలిపారు. ఛాతినొప్పి, ఎడమ భుజం లాగడం, ఆయాసం, గుండె దడ, నీరసం, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే దగ్గరలోని సీహెచ్‌సీలకు వచ్చి వైద్యులను సంప్రదించాలని సూచించారు. వైద్యులు మొదటగా ఈసీజీ తీసి గుండె సంబంధిత లక్షణాలను పరిశీలిస్తారన్నారు. కండీషన్ సీరియస్‌గా ఉంటే కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలోని కార్డియాలజీతో పేషెంట్ కండీషన్ వివరించి వారి సూచనల మేరకే ఇంజెక్షన్ ఇస్తామని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోని సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్యులు రవికుమార్, కళ్యాణి, నర్సులు, ఫార్మాసిస్టులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణలను తొలగించకుంటే చర్యలు

బేతంచెర్ల: మండల పరిధిలోని రంగాపురం గ్రామంలో జాతీయ రహదారి నిర్మాణానికి సహకరించాలని తహసీల్దార్ ప్రకాశ్ బాబు కోరారు. శుక్రవారం రెవెన్యూ సిబ్బందితో కలిసి గ్రామంలో ప్రచారం నిర్వహించారు. జాతీయ రహదారి నిర్మాణాన్ని ఆక్రమించి కట్టుకున్న ఇళ్లు, స్థలాలను సోమవారం నాటికి ఖాళీ చేయాలని తెలిపారు. సామగ్రిని తీసుకెళ్లాలని లేకుంటే కూల్చివేస్తామని హెచ్చరించారు.

ఎల్లమ్మకు పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న బుగ్గన అర్జున్‌రెడ్డి, నాయకులు

బేతంచెర్ల: గూటుపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన ఎల్లమ్మ, లింగమయ్యస్వామి ఆలయాన్ని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్ రెడ్డి, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. వారితో పాటు సర్పంచ్ శ్రీరాములు, వైస్ ఎంపీపీ రంగస్వామి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీతారామచంద్రుడు, అధికార ప్రతినిధి మురళీకృష్ణ, మండల కన్వీనర్ తిరుమలేశ్వర్‌రెడ్డి, నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, మనోహర్ రెడ్డి, భరణి ఉన్నారు.

ఆరోగ్యకరమైన జీవన విధానం అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న సీహెచ్‌సీ సూపరింటెండెంట్

బేతంచెర్ల: వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే ఆరోగ్యకరమైన జీవన విధానం అలవర్చుకోవాలని శేషారెడ్డి సీహెచ్‌సీ సూపరింటెండెంట్ సాగరిక అన్నారు. గుండెకు భరోసా కార్యక్రమంపై శుక్రవారం ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లకు అవగాహన కల్పించారు.గుండె జబ్బులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారంపై క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గుండెపోటు వచ్చిన వ్యక్తిని కాపాడడానికి రూ. 45 వేల విలువ చేసే ఇంజెక్షన్ వేస్తామన్నారు.

వైభవం.. తిరుచ్చి ఉత్సవం



మద్దిలేటిస్వామికి ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

బేతంచెర్ల: వైష్ణవ పుణ్యక్షేత్రమైన మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో మాఘ మాసం శుక్రవారం రాత్రి స్వామివారికి తిరుచ్చి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పుష్పాలతో అలంకరించిన పల్లకీలో స్వామివారిని కొలువుంచి కాగడ వెలుతురులో భక్తుల గోవింద నామస్మరణ నడుమ ఆలయ ప్రాకారంలో ఊరేగింపు కనుల పండువగా సాగింది. ఉప కమిషనర్, ఆలయ ఈఓ రామాంజనేయులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఇళ్ల స్థలాలకు వినతి



ఆర్డీఓకు వినతి పత్రం అందజేస్తున్న కాలనీవాసులు

డోన్ టౌన్: అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేసి ఆదుకోవాలని పట్టణంలోని కేఈ కృష్ణమూర్తినగర్ కాలనీవాసులు శుక్రవారం ఆర్డీఓ నరసింహులును కలిసి వినతిపత్రం అందజేశారు. వెంకటాపురం రోడ్డులోని సంజీవ ఆంజనేయస్వామి గుడి ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ భూమిలో ఇళ్ల స్థలాలను కేటాయించాలని కోరారు. కాలనీవాసులు మాధవస్వామి, శివ, మహ్మద్, గంగన్న, బోయ మధు, వడ్డే మద్దిలేటి, శంకరాచారి ఉన్నారు.

లబ్ధిదారుల వివరాలు సేకరణ

డోన్ టౌన్: పట్టణంలో ఇళ్లు లేని పేద కుటుంబాలను గుర్తించి ఇంటి స్థలాల మంజూరుకు కృషి చేస్తామని సీపీఐ పట్టణ కార్యదర్శి మోటా రాముడు తెలిపారు. శుక్రవారం ఆ పార్టీ మండల కార్యదర్శి నారాయణ, పట్టణ సహాయ కార్యదర్శి రామ్మోహన్ పట్టణంలోని డాక్టర్ పోచా ప్రభాకర్‌రెడ్డి నగర్‌లో నిరుపేదల వివరాలను నమోదు చేసుకున్నారు. పార్టీ రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఇల్లు లేని నిరుపేదల గుర్తింపు కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవాలు



ధ్వజ స్తంభానికి పూజలు చేస్తున్న భక్తులు



వాస్తు ప్రధాన కలశ అవాహన పూజలు

బేతంచెర్ల: పట్టణ సమీపంలోని నంద్యాల రహదారిలో వెలసిన పలక చింతమాను ఆంజనేయస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ట ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయ నిర్వాహకులు, వేదపండితుల ఆధ్వర్యంలో గోపూజ, గంగపూజ, మహా గణపతి పూజ, పుణ్యాహవాచనం, మాతృకాపూజ, 108 కలశాలతో అభిషేకం, ధాన్య ధివాసం, శయ్యాధివాసం నిర్వహించారు. శనివారం 11:30 మేషలగ్నంలో యంత్ర ప్రతిష్ట, ధ్వజస్తంభ ప్రతిష్ట నిర్వహించనున్నట్లు తెలిపారు.

వెట్టిచాకిరీ చేయిస్తే కఠిన శిక్షలు

- సీనియర్ సివిల్‌జడ్జి తంగమణి



అవగాహన కల్పిస్తున్న జడ్జి తంగమణి

డోన్ టౌన్: నిరుపేదలను ఇళ్లలో పాచిపనితో పాటు ఇతర పనులు చేయించుకుంటూ చాలీచాలని జీతాలు ఇస్తూ వారి పిల్లలను కూడా బానిసలుగా చూసే వారికి కఠిన శిక్షలు తప్పవని మండల లీగల్ సర్వీసు అథారిటీ చైర్‌పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి తంగమణి అన్నారు. ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు శుక్రవారం డోన్ సబ్‌కోర్టు ఆవరణలో వెట్టిచాకిరీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. చిన్న పిల్లలను పనిలో పెట్టుకోవడం వల్ల ప్రాథమిక విద్యా హక్కుకు దూరమవుతారని తెలిపారు. ఇది చట్టరీత్యా నేరం అన్నారు. పిల్లలను పనిలో పెట్టకోకూడదని స్పష్టం చేశారు. వారి తల్లిదండ్రులను బానిసలుగా మార్చి పనులు చేయిస్తే చట్టపరంగా శిక్షార్హులవుతారన్నారు. వెట్టిచాకిరీ విముక్తి కోసం కార్మికశాఖ, మాతా శిశు సంరక్షణ విభాగాలతో తనిఖీలు చేపట్టి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా కిరాణ, బట్టల దుకాణాలు, ఇటుక బట్టీలు, లారీ మెకానిక్ షాపులు, రైల్వే స్టేషన్లలో ముమ్మర తనిఖీలు చేయాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ సునీల్‌రాజా, పోలీసులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకే



వాహనాల రికార్డులు పరిశీలిస్తున్న సీఐ

కోవెలకుంట్ల: వాహన చోదకులు మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు శిక్ష తప్పదని కోవెలకుంట్ల సీఐ హనుమంతునాయక్, ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని గ్రామ పంచాయతీ సర్కిల్‌లో శుక్రవారం రాత్రి డ్రంకన్ డ్రైవ్ నిర్వహించారు. నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, జమ్మలమడుగు, తాడిపత్రి, తదితర ప్రాంతాలవైపు వెళ్లే వాహన చోదకులను ఆపి డ్రంకన్‌డ్రైవ్ టెస్ట్ నిర్వహించారు. అలాగే ఆర్సీ, లైసెన్స్, హెల్మెట్, తదితర రికార్డులు లేని వాహన చోదకులకు జరిమానా విధించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని పేర్కొన్నారు.

రైతులను పట్టించుకోని కూటమి ప్రభుత్వం

డోన్ టౌన్: కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు అవుతున్నా రైతులను పట్టించుకున్న పాపాన పోలేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని ఎద్దుపెంట గ్రామంలో ఓ వివాహ వేడుకకు హాజరైన బుగ్గన అర్జున్‌రెడ్డి రైతులను కలుసుకొని వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. పంటకు గిట్టుబాటు ధర కూడా కల్పించలేని స్థితిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా, పంటకు గిట్టుబాటు ధర, సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు, మందులు ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లోనే దొరికేవని తెలిపారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం



ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఈఓ జనార్దన్‌రెడ్డి

కోవెలకుంట్ల: క్రమశిక్షణ, పట్టుదల, ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జిల్లా విద్యాధికారి జనార్దన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం పట్టణంలోని సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం (యానువల్ డే ఓపెన్ హౌస్) నిర్వహించారు. డీఈఓతో పాటు మండల విద్యాధికారులు వెంకట్రామిరెడ్డి, వెంకటసుబ్బయ్య, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాజయ్య, హైదరాబాద్‌లోని జేఎంజే పాఠశాల కరస్పాండెంట్ జాన్‌మేరీ, ఇన్నమ్మ, తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. డీఈఓ మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తుకు పదో తరగతి పునాదివంటిదన్నారు. పబ్లిక్ పరీక్షలంటే భయం వీడాలని సూచించారు. పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాఠశాల హెచ్‌ఎం గీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇక మండే కాలమే..!



ఫిబ్రవరి ఆరంభం నుంచే భానుడు భగభగలాడుతున్నాడు. ఉదయం ఎనిమిది గంటల నుంచే ఎండ తీవ్రత పెరుగుతోంది. ప్రారంభంలోనే ఇలా ఉంటే రానున్న రోజుల్లో భానుడి ప్రతాపాన్ని తట్టుకోవడం కష్టంగానే ఉంటుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజుల నుంచి 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతుంది. తెల్లవారుజామున చలి కొంత వరకు ఉంటుంది. ఇప్పటికే ఇళ్లు, కార్యాలయాలు, వ్యాపార సముదాయాల్లో ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు ఉపయోగించుకుంటున్నారు. 2024 కంటే ఈసారి మరింత ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు అయ్యే అవకాశాలు ఉంటాయని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఉష్ణోగ్రతలు పెరగడంతో పశు పక్ష్యాదులు అల్లాడిపోతున్నాయి. దాహం తీర్చుకునేందుకు పాట్లు పడుతున్నాయి. చాలా మంది జంతు ప్రేమికులు పక్షుల కోసం ఇళ్లపైన, కాంపౌండ్‌ల వద్ద చిన్న తొట్టెలు ఏర్పాటు చేసి నీళ్లు పోస్తున్నారు.

–కొలిమిగుండ్ల